# ఒక ఉదయం

ప్రకాశం నెమ్మదిగా నడుచుకుంటూవచ్చి ఇంట్లోకి ప్రవేశించాడు నక్షత్రాలయితే అస్తమించాయిగాని ఇంకా తెల్లవారలేదు. దూరంగా రాబందులు అప్పుడే నిద్దరలేచి ఉత్సాహంగా అరుస్తున్నాయి. గాలి దిక్కులేనట్లు బరువుగా వీస్తోంది.

ప్రకాశం ఒక్కొక్క మెట్టే ఎక్కి మేడపైకి చేరుకున్నాడు. అతనికి మెదడు నిండా ఏదో బరువైన వస్తువు - చీకటిలాంటిది—నిండినట్లుంది. అతని బాల్యస్నేహితుడు శంకరం ఒకగంటక్రితమే చచ్చిపోయాడు. ప్రకాశం ఇప్పుడు తిరిగి వస్తున్నది ఆ శంకరం ఇంటిదగ్గర్నించే.

ప్రకాశానికి ఆ విచారంతో మేలుకుని ఉండడం ఇష్టంలేదు. ఈ మేడమీంచి చూస్తే శంకరం ఇంటివాకిలి కనిపిస్తుంది. అక్కడ వాళ్ళు శంకరాన్ని ఆఖరి ప్రయాణానికి సిద్ధంచేస్తున్నారు. 'శంకరం చచ్చిపోయాడు' అనుకున్నాడు ప్రకాశం.

శంకరానికి నలభైఐదేళ్లు. తనకన్న రెండేళ్ళే పెద్ద. శంకరం చచ్చిపోయాడు—తన చేతుల్లోనే. తన ప్రాణస్నేహితుడు! రాత్రి రెండుగంటలకి తనకి కబురొచ్చింది శంకరానికి ప్రమాదంగా ఉందని. ఆ చీకట్లో శంకరం కొడుకు దీపం చూపిస్తుండగా నడుస్తుంటే తను రెండుసార్లు తూలి ముందుకు పడబోయాడు. కాళ్ళు ఒణుకుతున్నాయి. అడుగుపడవలసినచోట పడటం లేదు......తరవాత ఆ దృశ్యం అంతా ఒక్కసారి అతనికి గుర్తొచ్చింది. అతను తట్టుకోలేకపోయాడు. "నేనిప్పుడు ఆలోచించలేను. నాకిక్కి మంచిపని" అనుకుని నిద్రపోవాలని మంచంమీద పడుకున్నాడు తనకిప్పుడు నిద్రకావాలి. నిద్ర. నిద్రపోవాలి.

కళ్లుమూసుకున్నాడు. శంకరం చచ్చిపోయాడు. టైఫాయిడ్. రెండుసార్లు తిరగబెట్టింది. ఇంక నెమ్మదిస్తుందనుకున్నారు. నిన్ననేగా తనువెళ్ళి శంకరంతో మాటాడతా! శంకరం ఎంతహుషారుగా మాట్లాడాడు! నలభైరోజులు అలా పడుకుని ఉండడం. వాడికి విసుగెత్తిపోయిందిట. "జ్వరం కాస్త తగ్గగానే రిక్షాలో ఊరంతా తిరిగేస్తా. డాక్టర్ వీల్లేదన్నాసరే ఊరు చూడక పిచ్చెత్తిపోతోందిరా" అన్నాడు శంకరం.

శంకరం పెద్దవాళ్ళలో కలిసిపోయాడు. చచ్చిపోడం ఎంతసులభం...అతను నెమ్మదిగా లేచి కూర్చున్నాడు. గదినిండా నీడలు. రాత్రి తగ్గించి ఉంచిన కొడిగుడ్డు దీపం పాలిపోయినట్లుంది. ప్రక్కనే మంచంమీద ఉష నిద్రపోతోంది. ఉషకి

## "జ్యేష్ఠ"

ముప్ఫైఎనిమిది వెళ్ళి ముప్ఫైతొమ్మిదొస్తుంది వచ్చేనెలలో. ఉష నిద్దరోతోంది. డాబామీద తమపిల్లలు నిద్దరోతున్నారు. పెద్దవాడికి పందొమ్మిదేళ్ళు నిండుతాయి. రెండునెల్లో......తనకి నలభైమూడేళ్లు. తను పెద్దవాడై పోతున్నాడు.

అతనికి గుండె ఝల్లుమంది. తరవాత గుండె దడదడా కొట్టేసుకుంది. భయం. శంకరాన్ని మోసేస్తున్నారు కాబోలు—బాజా మోగుతోంది.

చావంటే ఎందుకు భయపడాలి? అతనికి జవాబు దొరకలేదు. తను కాలేజీ కుర్రాళ్ళకి "షేక్స్పియర్" నాటకాలు అర్థం చేసుకోడం నేర్పుతాడు. వాటిలో చావు బోలెడుచోట కనిపిస్తుంది. ఒక్క చావైనా లేని ఇంగ్లీషు నవలలు తను చదివిన గుర్తు లేదు. ఒకటైనా చావు కబురులేని వార్తా పత్రిక తను చూడలేదు. తను అప్పుడు చావంటే భయపడ్డాడా? లేదు. బొత్తిగా భయపడ


చీకటిలో మీ సహవాసి

ఎస్ట్రెలా బ్యాటరీలు



మీ బేటరీ లైటు
నమ్మకముగా వెలుగుటకు ఎల్లప్పుడూ
ఎస్ట్రెలా బేటరీ వుపయోగించండి
అది చాలాకాలము వరకు ఎక్కువ
ప్రకాశవంతమైన వెలుగునిచ్చును.




ఎస్ట్రెలా బేటరీస్ లిమిటెడ్
బొంబాయి - మద్రాసు - ఢిల్లీ - కలకత్తా - కాన్పూరు

లేదు. ఇప్పుడెందుకింత భయం? శంకరాన్ని తీసుకుపోతున్నారు. వాడి కుటుంబం మళ్ళీ ఒక్కసారి గొల్లుమంది. శంకరానికి ఇప్పుడు ఎవరెంత గట్టిగా ఏడిచినా వినపడదు. శంకరం చచ్చిపోగానే తనలో పెద్ద కుదుపు కలిగింది. శంకరం కొయ్యబారి పోగానే తనకి అక్కణ్ణించి పరుగెత్తుకుని వచ్చేయాలనిపించింది. ఆ శవాన్ని చూస్తుంటే ఒక నిముషం క్రితం దాని పేరు "శంకరం" అని నమ్మబుద్ధి కాలేదు. తనకి ఆ జరుగుతున్నది నిజంలా తోచలేదు......

ఉష లేచి కూర్చుంది. అతన్ని చూసి నిశ్శబ్దంగా నవ్వి ఆవలించింది అతనిలో ఏం చలనం కలగలేదు. మామూలుగా ఉన్నట్టయితే అతను ఆ చిన్న నోరు ఆవులింతతో పువ్వులా విచ్చుకోడం చూస్తూ ఒళ్ళు మరిచేవాడు. చావు బాజాలు దూరంగా వినిపిస్తున్నాయి. వలకొళ్ళు ఈ ఊరికి ఉత్తరంగా ఉన్నాయి. తనూ శంకరం చిన్నప్పుడు అక్కడున్న పెద్ద వేపచెట్టెక్కి దొంగతనంగా బీడీలు కాల్చేరు ఓసారి. అది ఎవరో చూసి పెద్ద వాళ్ళతో చెపితే... ఇప్పుడు తను పూడ్చిపెట్టే చోటుకి వాళ్ళతో వెళ్ళవలసింది. కాని, కాలు కదలందే. ఎక్కడేనా తూలిపడితే! తనూ పెద్దవాడై పోతున్నాడు.

అతనికి భయం వేసింది.

ఉషని చూస్తూ 'మనం పెద్ద వాళ్ళమవుతున్నాం' అన్నాడు. పుట్టెడు దిగులు ఆ మాటల రూపంలో వెళ్ళిపోయింది. ఇంక తొంభైతొమ్మిది పుటు మాత్రం అతని నెత్తి మీద ఉంది. ఉష విని ఊరుకుంది. ఏం మాట్లాడలేదు. అర్థం కానట్టు చూసింది.

అది అతనికి నచ్చలేదు. స్నేహితుడు చచ్చిపోయి అంత దుఃఖంలో తనుంటే ఏం పట్టించుకోకుండా కూర్చుంది ఉష. ఉష మళ్ళీ ఆవులించింది. ఉష నోరు విచ్చిన దానిమ్మ పండులా ఉంది. అది అతనికి నచ్చలేదు. ఉక్రోషం వచ్చింది. "ఉషా. శంకరం పోయాడు – తెలుసా?" నిష్ఠూరంగా మాట్లాడేడు.

ఉష తల ఆడించింది. ఆలోచిస్తూ "ఏడుపులు వినిపించాయి. ఏం చూడను? నా ఆరోగ్యం కూడా ఏం బాగాలేదు. ఎప్పుడు ఏదో మగతగా ఉంటోంది..." అన్నది.

ప్రకాశం వింటున్నాడు, 'నేను పెద్దవాణ్ణై పోతున్నాను' అనుకుంటూ. చచ్చిపోడం... టేబిల్ మీద అద్దంతీసి పరీక్షగా తన మొహం చూసుకున్నాడు. కొద్దిగా గడ్డం మొలిచింది. కళ్ళకింద గీతలు జాగ్రత్తగా చూస్తే కనిపిస్తాయి. తలలో అక్కడా అక్కడా ఒక తెల్లవెంట్రుక. అద్దంలోకి చూస్తూనే, "అదికాదు ఉషా. శంకరం చచ్చిపోయాడు" అన్నాడు. ఎందుకు అలా అన్నాడో అతనికి తెలీదు.

ఉష ఒకసారి గది అంతటా చూసింది. డాబామీద మంచాలమీద పిల్లలు నిద్రపోతున్నారు. నెమ్మదిగా "నాకు మళ్ళీ నెలతప్పింది" అన్నది.

ప్రకాశం ఉలికిపడ్డాడు. ఒక్కసారిగా ఇంటి కప్పుకేసి చూస్తూ తీవ్రంగా ఏదో ఆలోచించడం మొదలు పెట్టాడు.

...నిజంగా? నిజంగా! నిజం. తన ఇంట్లో మరో పాప. తన ఇంట్లోంచి మరో ప్రాణం.

అతను మళ్ళీ తలదించి ఉష మొహంలోకి చూసేసరికి ఇరవై సెకన్లు పట్టింది. అతని మొహంనిండా వెలుగు పులుముకున్నట్లుంది. అతని కళ్ళలోంచి పొంగుతున్న సంతోషం బుగ్గలమీద కాలవలు కట్టింది. అతను ఇకిలిస్తున్నాడు. అది కాలేజీ కుర్రాడి నవ్వు! ఇరవై సెకండ్లలో ఎంతమార్పు! ఒక స్విచ్ ఆఫ్ చేసి మరోటి ఆన్ చేసినట్టే!

అతను తన మంచంమీంచి లేచివచ్చి ఉష మంచంమీద ఆమె పక్కనే కూర్చున్నాడు. ఉష ఎడం అరచేతిని తన రెండు చేతుల్లోకి కప్పేశాడు. ఉష ముంజేతిమీద ఇందుపగింజంత పుట్టుమచ్చ ఉంది. ఆ తేనె రంగు చేతిమీద పట్టుకుచ్చులా మెరుస్తుందది. ఉష లేచి నిలుచుంది. కొద్దిగా కోప్పడింది. "ఊ వదలండి మరీ చిన్నపిల్లలై పోతున్నారు" అంది. ప్రకాశం "ఏయ్ 'పిల్లా' వెళ్తే వెళ్ళావు కాని ఆ జడ ముందుకు వేసుకుని మరీ వెళ్ళు" అన్నాడు ఉష మెట్లు దిగుతుంటే.

"ఏయ్ పిల్లా!" అతని నవ్వు పొంగి వచ్చింది. "మరీ చిన్నవాణ్ణై పోతున్నాను. ఊహుహు"అని నవ్వేశాడు. ఆనవ్వు విద్దటో విని పిల్లలందరూ లేచికూర్చున్నారు. ★



మేష్టారు: "రామూ నీలాగు ఎడమ జేబులో పదిరూపాయిలు, కుడిజేబులో ఏడు రూపాయలు వున్నాయి. అప్పుడు ఏమౌతుంది?"

రాము: "లాగు నాదిమాత్రం ఎప్పుడూ కాదండి"

